# సుబ్రావ్ పెళ్ళి



పొదలకూరు జ్ఞానసుందర్

**సుబ్రావ్‌కు** అందమైన జంటల్ని చూసినప్పుడంతా మనసు పాడై పోతుంది' ఒక్కోసారి దిక్కులు తెలియక ఇంటి దారికూడా తప్పి పోతూండడం రివాజు.

దీని కంతా కారణం సుబ్రావ్‌కు ఇంకా పెళ్ళి కాకపోవడం!

పెళ్ళి చేసుకోవాలనే ఆలోచన బలంగా నాటుకుని పోవడం. సుబ్రావ్ డిగ్రీ ఆరోసారి అనుకోకుండానే పాస్ అయిపోయాడు.

ఇంత కష్టపడి డిగ్రీ పాస్ చేసినా సుబ్రావ్ ఫాదర్ ఉద్యోగం వస్తేనే నీ పెళ్ళి అని అన్నాడు. ఆ మాట వింటూనే తల డిల్లి పోయాడు. ''నువ్వు ఆరోసారి గాని డిగ్రీ పాస్ కాలేదు గదరా, వెధవా, నీ కప్పుడే పెళ్ళేమిటి'' అని మొహం పైన అనుంటే కూడా బాధ పడేవాడు కాదు. కానీ—''నీకు ఉద్యోగం వస్తేనే పెళ్ళి!'' ఆ మాటే సుబ్రావ్ చెవుల్లో గింగిర్లు మంటున్నాయ్.

ఇక ఆలోచించి లాభం లేదని వెంటనే పోస్టాఫీసు వెళ్ళి ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌కు చందా కట్టేశాడు.

అంత క్రితం లైబ్రరీ ఎక్కడుందోకూడా తెలియని వాడు—ఆతరవాత ఎలాగో తెలుసుకుని లైబ్రరియన్ కన్న ముందు లైబ్రరీ దగ్గరుండి తలుపులు తెరుస్తూనే ( రిలీజయిన సినిమాకు మొట్ట మొదట టికెట్టు తీసుకుని సినిమా హాల్లో ఒక ఫోజు పెట్టి అడుగు పెట్టిన సినిమా పిచ్చోడిలా ) లోపలికి జొరబడి డెయిలీస్ తీసుకుని వాంటెడ్ కాలమ్స్ అన్నీ తెగ వెదికి తన అర్హతకు తగ్గవి నోట్ చేసుకుని, ఇంటికి వచ్చి ఆ రోజు ఉద్యోగానికి అప్లై చేసేవాడు. రాత్రింబవళ్ళు నిద్రాహారాలు మాని అప్లికేషన్సు ఫిలప్ చేయడం, మార్క్సులిస్టులు అవీ ఇవీ టైపు చేయించడం, అట్టస్టేషన్సు చేయించడం...దీనితోనే ఇరవైనాలుగు గంటలు గడిపేసేవాడు. ఒక్కోసారి నిద్ర కుపక్రమించినా కళ్ళు ముందు 'వాంటెడ్ కాలమ్స్' వచ్చి నిలిచేవి.

తెల్ల కాగితాలు, ఇంకు బాటిల్ ( పెద్దది ) ఎన్వలప్స్ ఒకకట్ట కొని తేవడం చూసిన ఒకఫ్రెండ్. ''ఏంట్రా సుబ్రావ్! ఈ మధ్య కథలు వ్రాయడం వంటి పనులు ఏమైన చేస్తున్నావా?'' అన్నాడు.

''నా జీవితమే ఒక కథలాగుంది' అన్నాడుసుబ్రావ్, తెలుగు సినిమాలో బరువైన పాత్ర చెప్పిన డైలాగులా 'వీడేదో పిచ్చోడు అయిపోయేటట్లుంది!' అనుకుంటూ వెళ్ళి పోయాడు సుబ్రావ్ ఫ్రెండ్.

ఇన్ని చేస్తున్నా కొన్ని ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు వచ్చేవి. కొన్నింటికి అసలు జాడేతెలిసేది కాదు. వచ్చిన ఇంటర్వ్యూల కల్ల హాజరయ్యే వాడు. అయినా ఫలితం లేకపోయింది. 'ఇక తనకు ఈ జన్మకు పెళ్ళి కాదు. ఆ జన్మబ్రహ్మచారిగానే చనిపోవాలిసిందే! తన భార్యతో కలసి ఏమిటేమిటో చెయ్యాలనుకున్నాడు. తన ఆశలన్నీ అడియాసలేనా?' అని తనకు తానే వాపోయేవాడు.

పట్టు వదలని విక్రమార్కుడిలా తనూ పట్టు వదల్లేదు. గడ్డం పెంచేశాడు. జుట్టు కాస్త పెంచేశాడు—పిచ్చాడిలా తయారయ్యాడు.

ఇదంతా చూసిన సుబ్రావ్ తల్లిగారు భర్తతో—''ఏవండీ! వాడికి పెళ్ళి చేసెయ్యండి... పిచ్చాడిలా తయారవుతున్నాడంది ''

''వాడు పిచ్చివాడయినా ఫరవాలేదు—వాడికి ఉద్యోగ వస్తేనే పెళ్ళి'' అన్నాడు. ఆ మాట వింటూనే నిమిషానికి అరవై సార్లు కొట్టుకోవాల్సిన గుండె యాభై ఎనిమిది సార్లే కొట్టుకుంది సుబ్రావ్‌కు.

ఉన్నట్టుండి ఒక ప్రైవేట్‌కంపెనీలో ఉద్యోగంలో జాయిన్ కమ్మంటూ డైరెక్టు అపాయింట్‌మెంట్ వచ్చింది. అది చూస్తూనే సుబ్రావ్ తల్లిదండ్రులు సంతోష పడిపోయారు. కానీ సుబ్రావ్ మొహంలో సంతోష చాయలు కనబడక పోయేసరికి "ఏమిట్రా, సుబ్బూ! అలా ఉన్నావ్?"అన్నాడు.

"ఏమిల్లేదు, నాన్నగారూ! అపాయింట్‌మెంట్ ఆర్డర్స్‌తో డిపాజిట్ మూడు వేల్రూపాయలు కట్టమని ఉంది" అన్నాడు.

"ఓస్ అందుకేనే బాధపడిపోతున్నావ్?" అని వెంటనే మూడువేలు తెచ్చి ఇచ్చి ఉద్యోగంలో చేర్డానికి ఇంకా నాలుగురోజులు టైముండినా, వెంటనే ఆ రోజే బయల్దేరదీశాడు. దగ్గరుండి ట్రైనెక్కించి మరీ వచ్చాడు సుబ్రావ్ ఫాదర్.

ఒక మంచిరోజు చూసుకొని ఆ పక్క వూర్లో ఉంటున్న తన చెల్లెలింటికెళ్ళి—"ఏమిటే, అలివేలు! సుబ్బుడికి ఉద్యోగమొచ్చేసింది. నెలకు ఏడువందలు జీతం. వాడు పెళ్ళీ అని గోల పెడుతున్న విషయం నీకు తెలిసిందేగా! వెంటనే మీ అమ్మాయికి మా అబ్బాయికి పెళ్ళి తతంగం చెయ్యి"అన్నాడు.

ఆ మాట వింటూనే సంతోషంతో అలివేలు ముఖం చాటంతయ్యింది. "నిజమేనా, అన్నగారు! ఉద్యోగం ఎక్కడ, ఏమిటి విశేషాలు?" అంది.

"మద్రాసులోనే! వీడికి అరవం కూడా తెలియదు. ఏం బాధలు పడతాడో ఏమిటో" అన్నాడు సుబ్రావ్ ఫాదర్.

"వాడికేం, అన్నగారు! ! బి. ఎ. పాసయ్యాడు" అంది. ఇంకెవ్వరూ దేశంలో బి. ఎ. పాస్ కానట్టు.

"ఇంతకీ మనమ్మాయి ఎక్కడ? "

"అదిగో ఆ తలుపు చాటు నుంచి వింటోంది చూడు! వాళ్ళ ముద్దుల బావ విశేషాలన్నీ!"

తలెత్తి చూసిన సుబ్రావ్ ఫాదర్‌కు ముసి ముసి నవ్వులు నవ్వుతుంటూ సిగ్గుతో లోపలికెళ్ళిన సుబ్రావ్ ఉడ్ బీ వైఫ్ వరాలు కనబడింది.

"సరేలే! ఇక నే వెళ్ళొస్తా. ముహూర్తాలు ఎప్పుడున్నాయో తెలుసుకొని నీకు తెలుపుతా" అంటూ ఇంటికొచ్చేశాడు.

పంచాంగంలో రెండు నెలల వరకూ ముహూర్తాలు లేవని తెలిసినా, సుబ్రావ్ ఫాదర్ ఆ విషయమే సవివరంగా కుమారుడికో ఉత్తరం, చెల్లెలు అలివేలుకో ఉత్తరం రాశాడు.

ప్రతి నెలా సుబ్రావ్ నాలుగు వందలుమాత్రమే పంపేవాడు తండ్రికి. రెండు నెలలు గడిచిపోయాయి. ముహూర్తాలు నిర్ణయించేశారు. సుబ్రావ్‌ను ఒకనెల సెలవు ఉంచి రమ్మని ఉత్తరం వ్రాశాడు సుబ్రావ్ తండ్రి. ఆ ఉత్తరం అందిన రోజే వచ్చి వాలిపోయాడు. పెళ్ళికింకా రెండురోజులుంది. ఆ రెండు రోజులు రెండయుగాలుగా గడిచాయి సుబ్రావ్‌కు.

ముహూర్తం రోజు రానే వచ్చింది. తాళి కట్టేశాడు. కన్న కలలన్నీ నిజమైనాయని వరాలు, సుబ్రావ్ ఇద్దరూ సంతోషపడిపోయారు.

నెమ్మెగ ఒక వారం గడిపోయింది. ఉద్యోగానికి వెళ్ళాలని ఆలోచనే సుబ్రావ్‌కు లేపోయేసరికి, ఆ రోజు సుబ్రావ్ ఫాదర్—"ఏమిటే మనవాడు ఎప్పుడు తీసుకెళ్తాడట పెళ్ళాన్ని మద్రాసుకు?" అన్నాడు. "వాడిక మద్రాసుకు వెళ్ళడటండీ! ఈ రోజే చెప్పాడు విషయమంతా—మద్రాసులో ఉద్యోగం లేదంటూ, వల్లకాడు లేదట. మీరు వాడికి త్వరగా పెళ్ళి చేయక పోయేసరికి వాడు, వాడి ఫ్రెండ్ వరాలు కలిసి ఈ ఐడియా వేశారట."

"ఏమయిడియానే? త్వరగా చెప్పు—నా తల బద్దలైపోతుంది" అన్నాడు.

"ఉద్యోగంలో చేరమని వచ్చాయి చూడండి—ఆ కాగితాలు వీడు పంపినవేనట."

"మరి నెలనెల్లా మనకు నాలుగొందలు పంపేవాడే?"

"అసలు ఉద్యోగముంటే గదండీ! మన దగ్గ తీసుకెళ్ళిన మూడు వేలల్లో నెలనెలా పంపేవాడట."

ఆ మాట వింటూనే నిలువునా కూలిపోయాడు సుబ్రావ్ ఫాదర్. ★

